క్లుప్తంగా

నేడు తెనాలిలో అర్బన్ మార్కెట్ ఏర్పాటు

తెనాలి అర్బన్: మెప్మా మిషన్ డైరెక్టర్ ఆదేశాల మేరకు తెనాలి పురపాలక సంఘం ఆధ్వర్యంలో గురు, శుక్రవారాలలో మార్కెట్ వద్ద అర్బన్ మార్కెట్‌ను ఏర్పాటు చేస్తున్నట్లు కమిషనర్ బండి శేషన్న ఒక ప్రకటనలో తెలిపారు. స్వయం సహాయ సంఘ సభ్యులు తయారు చేసిన పిండి వంటలు, ఇతర వస్తువులను ఇక్కడ అమ్మకాలు జరపనున్నట్లు పేర్కొన్నారు. మహిళలు తయారు చేసే వస్తువులకు మార్కెట్‌ను కల్పించాలనే ఉద్దేశంతో దీన్ని ప్రతి నెలా ఏర్పాటు చేస్తున్నట్లు వివరించారు. పట్టణ ప్రజలంతా స్టాల్స్‌ను పరిశీలించి వారిని ప్రోత్సహించాలని ఆయన కోరారు.

క్రీడాకారుడికి అభినందన



తెనాలి: తెలంగాణ రాష్ట్రంలో ఇటీవల జరిగిన 68వ స్కూల్‌గేమ్స్ ఫెడరేషన్ జాతీయస్థాయి హ్యాండ్‌బాల్ పోటీల్లో రన్నర్స్ స్థానాన్ని కైవసం చేసుకున్న ఆంధ్రప్రదేశ్ జట్టు క్రీడాకారుడు, స్థానిక ఎన్నార్ఐ జూనియర్ కాలేజీ విద్యార్థి అద్దంకి రాజ్‌పాల్‌ను బుధవారం యాజమాన్యం అభినందించింది. జట్టును ముందుండి నడిపిస్తూ విజయంలో కీలకపాత్ర పోషించాడని సత్కరించారు. కార్యక్రమంలో ఎన్నార్ఐ జూనియర్ కాలేజీ సీఈవో సీహెచ్. ఉమామహేశ్వరరావు, కాలేజీ ప్రిన్సిపాల్స్ కృష్ణారెడ్డి, సురేష్, విద్యార్థి తండ్రి నాగరాజు పాల్గొన్నారు.

రేపు 'యోధ' పుస్తక పరిచయ సభ

తెనాలి: పట్టణానికి చెందిన సాహితీ, సాంస్కృతిక సంస్థ 'భిన్నస్వరాలు' ఆధ్వర్యంలో ఈనెల 24న 'యోధ' మాతృత్వం–భిన్న వ్యక్తీకరణలు' పుస్తకం పరిచయ సభ జరగనుంది. స్థానిక నందులపేటలోని కవిరాజ పార్కులో సాయంత్రం ఆరు గంటలకు ఏర్పాటయ్యే సభను సంస్థ బాధ్యుడు జీఎస్ నాగేశ్వరావు నిర్వహిస్తారు. ప్రముఖ స్త్రీవాద రచయిత్రి ఓల్గా, 'చినుకు' సంపాదకుడు నండూరి రాజగోపాల్, ప్రముఖ స్త్రీవాద రచయిత్రి మందరపు హైమావతి, పుస్తక సంపాదకులు బండారు విజయ మాట్లాడతారు. మాతృత్వం భావన చాటున ఎదురైన అనేక మానసిక, శారీరక సంఘర్షణలను, హింసలను, సామాజిక సవాళ్లను ఆత్మస్థైర్యంతో ఎదుర్కొని ధైర్యంగా నిలబడిన 'యోధ'ల జీవిత చిత్రీకరణలే ఈ కథా సంకలనమని కవి, భిన్నస్వరాలు నిర్వాహకుడు జుగాష్ విలి తెలిపారు. మాతృత్వం అనే 'మిత్'లోని డొల్లతనాన్ని విప్పి చెప్పిన కథలివి. యాభై మూడు మంది పాత, కొత్త రచయిత్రుల భిన్న వ్యక్తీకరణలని ఆయన వివరించారు.

హోటల్ నిర్వాహకుడు అదృశ్యం



విజయ్‌కుమార్ (ఫైల్)

తెనాలి రూరల్: హోటల్ నిర్వాహకుడు అదృశ్యంపై కేసు నమోదైంది. పోలీసుల కథనం మేరకు వివరాలిలా ఉన్నాయి. మండలంలోని ఖాజీపేట గ్రామానికి చెందిన 59 ఏళ్ల పసుపులేటి విజయ్‌కుమార్ హోటల్‌కు అవసరమైన సరుకులు కొనుగోలు చేసేందుకు మంగళవారం సాయంత్రం వెళ్లి తిరిగి రాలేదున కుటుంబసభ్యులు గాలించినా ఫలితం లేకపోవడంతో పోలీసులను ఆశ్రయించారు. బుధవారం కేసు నమోదు చేసినట్లు రూరల్ ఎస్ఐ సీహెచ్ ప్రతాప్‌కుమార్ తెలిపారు.

జూదరుల అరెస్టు

మున్నంగి(కొల్లిపర): మండల పరిధి మున్నంగిలోని ఓ రేకుల పాకలో రహస్యంగా పేకాటాడుతున్న ఏడుగురిని ఎస్ఐ పి.కోటేశ్వరరావు బుధవారం అదుపులోకి తీసుకున్నారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రూ.13,900 స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. ఏడుగురిపై కేసు నమోదు చేసినట్లు చెప్పారు. దాడుల్లో ఏఎస్ఐ పోతురాజు, కానిస్టేబుల్ నాగబాబు పాల్గొన్నారు.

ఇద్దరు యువకుల ఘర్షణ: కేసు నమోదు

మంగళగిరి (తాడేపల్లిరూరల్): ఇద్దరు యువకుల మధ్య ఘర్షణ నేపథ్యంలో కేసు నమోదైన ఘటన బుధవారం మంగళగిరి రూరల్ పోలీస్‌స్టేషన్‌లో నమోదైంది. రూరల్ ఎస్ఐ వెంకట్ తెలిపిన వివరాల ప్రకారం.. మంగళగిరి మండలం నవులూరు గ్రామానికి చెందిన ఓ వివాహితతో యువకుడు దురుసుగా ప్రవర్తించడంతో ఆమె భర్తకు, యువకుడికి మధ్య ఘర్షణ జరిగింది. ఈ గొడవలో ఇద్దరు ఒకరిపై ఒకరు దాడిచేసుకోవడంతో ఇరువురికీ గాయాలు అయ్యాయి. దీంతో వివాహిత మంగళగిరి రూరల్ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా స్పందించిన రూరల్ ఎస్ఐ వెంకట్ ఇద్దరినీ అదుపులోకి తీసుకుని కౌన్సెలింగ్ నిర్వహించారు. అనంతరం ఇద్దరు యువకులపై కేసు నమోదు చేసి మంగళగిరి తహసీల్దార్ ఎదుట సత్ప్రవర్తన నిమిత్తం రూ.5 లక్షలతో బైండోవర్ చేసినట్లు ఎస్ఐ తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండల పరిధిలోని గ్రామ ప్రజలు ఎలాంటి గొడవలకు, దౌర్జన్యాలకు పాల్పడకుండా ఉండాలని పేర్కొన్నారు. ముఖ్యంగా యువకులు, విద్యార్థులు ఘర్షణలకు పాల్పడి తమ విలువైన భవిష్యత్తును పాడుచేసుకోవద్దని ఆయన సూచించారు.

పన్నుల వసూలుపై కసరత్తు

- తెనాలిలో ఇంటి, కుళాయి, నీటి పన్నుల వసూలు వేగవంతం
- ప్రత్యేక బృందాలు ఏర్పాటు
- పన్నులు చెల్లించని వారికి ఎస్ఎంఎస్‌లు



ఇంటి పన్ను కట్టించుకుంటున్న ఉద్యోగి

తెనాలి అర్బన్: పట్టణంలో పన్నుల చెల్లింపుల ప్రక్రియను మున్సిపల్ అధికారులు వేగవంతం చేశారు. దీనిలో భాగంగా వార్డు సచివాలయ పరిధిలోని ఉద్యోగులతో ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేశారు. పన్నుల చెల్లించని వారి వద్దకు పంపి వసూలు చేసే బాధ్యతను అప్పగించారు. గృహ యజమానులు, షాపుల అద్దెదారుల సెల్ ఫోన్‌లకు ఎస్ఎంఎస్‌లు పంపుతున్నారు. నూరు శాతం పన్నులు వసూలు చేసేందుకు చర్యలు తీసుకుంటున్నారు.

ఏడాదికి రూ.23.7 కోట్ల ఆదాయం

పురపాలక సంఘ పరిధిలో ఇంటి, ఖాళీ స్థలం, నీటి పన్నులతో పాటు షాపుల అద్దెల కింద ఏడాదికి సుమారు రూ.23.7 కోట్ల ఆదాయం సమకూరుతూ ఉంది. పట్టణ పరిధిలో సుమారు 37వేల నివాస గృహాలు ఉన్నాయి. వీటికి ఏడాదికి రెండుసార్లు పన్ను విధించి వసూలు చేస్తుంటారు. ఏప్రిల్ నుంచి సెప్టెంబర్ ఒకసారి, అక్టోబర్ నుంచి మార్చి వరకు మరోసారి విధించి వసూలు చేస్తుంటారు. పన్నుల రూపంలో ప్రతి ఏడాది రూ.21.61 కోట్ల ఆదాయం మున్సిపాలిటీకి సమకూరుతుంది. ఇప్పటి వరకు రూ.11.81 కోట్లు మాత్రమే వసూలు చేశారు. ఇంకా రూ.9.8 కోట్లు వసూలు చేయాల్సి ఉంది.

షాపుల అద్దెల వసూలు 90 శాతం పూర్తి

తెనాలి పట్టణంలో 234 మున్సిపల్ షాపులు ఉన్నాయి. వీటిని అద్దెకు ఇవ్వడం ద్వారా ఏడాదికి రూ.2.09 కోట్లు రావాల్సి ఉండగా ఇప్పటి వరకు రూ.1.74 కోట్లు వసూలు చేశారు. మిగిలిన రూ.35లక్షలు వసూలు చేయాల్సి ఉంది. దీనిని బట్టి చూస్తే ఇంటి పన్నుల వసూలు 55 శాతం షాపుల అద్దెల వసూలు 90 శాతం పూర్తయినట్లు తెలుస్తోంది.

వసూలు వేగవంతం

తెనాలి పురపాలక సంఘ పరిధిలోని పన్నులను వసూలు చేసేందుకు అధికారులు చర్యలు తీసుకుంటున్నారు. దీనిలో భాగంగా వార్డు సచివాలయ ఉద్యోగులు, మున్సిపల్ ఉద్యోగులతో 47 ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేశారు. వీరు ప్రతి ఇంటికీ వెళ్లి సకాలంలో పన్నులు చెల్లించాలని తెలియజేయటంతో పాటు వసూలు చేస్తున్నారు. ఇళ్ల యజమానుల సెల్ ఫోన్‌లకు ఎస్ఎంఎస్‌లు పంపుతున్నారు. మైక్ ప్రచారం చేస్తున్నారు. పన్నుల వసూలకు సంబంధించిన వివరాలు ప్రతిరోజు అధికారులు తెలుసుకుంటూ వారికి తగు సూచనలు ఇస్తున్నారు. పెద్ద మొత్తంలో చెల్లించాల్సిన వారి ఇళ్లకు అధికారులు వెళ్లి వారితో మాట్లాడి పన్నులు చెల్లించే విధంగా చూస్తున్నారు.

పన్నులు వసూలు చేసేందుకు ప్రత్యేక చర్యలు

తెనాలి పట్టణ పరిధిలోని ఇంటి పన్నులు, షాపుల అద్దెలు వసూలు చేసేందుకు ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నాం. ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేసి ప్రతిరోజు బకాయిదారులను కలిసి వసూలు చేయాలని ఆదేశించాం . పన్నులు చెల్లించాల్సిన వారు మార్చి 31లోపు చెల్లించాలని విజ్ఞప్తి చేస్తున్నాం. గడువులోపు పన్నులు చెల్లించకపోతే తర్వాత అపరాధ రుసుంతో చెల్లించాల్సి ఉంటుంది. అందరు సకాలంలో పన్నులు చెల్లించి పట్టణాభివృద్ధికి సహకరించాలి.

–బండి శేషన్న, కమిషనర్, తెనాలి పురపాలక సంఘం.

మున్సిపల్ నిధులతో పట్టణాభివృద్ధికి చర్యలు



శంకుస్థాపన చేస్తున్న చైర్‌పర్సన్ రాధిక

మున్సిపల్ చైర్‌పర్సన్ తాడిబోయిన రాధిక

తెనాలి అర్బన్: మున్సిపల్ నిధులతో తెనాలి పట్టణ అభివృద్ధికి అనేక చర్యలు తీసుకుంటున్నట్లు చైర్‌పర్సన్ తాడిబోయిన రాధిక పేర్కొన్నారు. పట్టణంలోని 32వ వార్డులో నూతనంగా నిర్మించనున్న సీసీ రోడ్డు, కాల్వ, 11వ వార్డులోని బీటీ రోడ్డుకు బుధవారం ఆమె శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పట్టణంలో అనేక సీసీ రోడ్లు, కాల్వలు నిర్మిస్తున్నట్లు తెలిపారు. కమిషనర్ బండి శేషన్న మాట్లాడుతూ 11వ వార్డులో బీటీ రోడ్డును రూ.16లక్షలతో, 32వ వార్డులోని రోడ్డు, కాల్వను రూ.51.79లక్షలతో నిర్మిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో కౌన్సిలర్లు కఠారి రత్నకుమారి, మట్లపూడి సంధ్యారాణి, ఇన్‌చార్జి ఎంఈ ఆకుల శ్రీనివాసరావు, వైఎస్సార్ సీపీ నాయకులు కఠారి హరీష్, మట్లపూడి రాజేశ్వరరావు, ఏఈ సునీల్ పాల్గొన్నారు.

చెత్త రహిత పట్టణంగా తెనాలి

తెనాలి అర్బన్: చెత్త రహిత పట్టణంగా తెనాలిని తీర్చిదిద్దేందుకు అన్ని చర్యలు తీసుకుంటున్నామని మున్సిపల్ చైర్‌పర్సన్ తాడిబోయిన రాధిక పేర్కొన్నారు. 24వ వార్డులో బుధవారం ఆమె పర్యటించారు. పారిశుద్ధ్య నిర్వహణ పనులు పరిశీలించి పలు సూచనలు చేశారు. వార్డులోని మురుగు కాల్వలో పూడికతీత పనులు చేయించారు. రోడ్లపై వ్యర్థాలను వెంటనే తొలగించాలని ఆదేశించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రతిరోజూ కార్మికులు ఇళ్లకు వచ్చి చెత్తను సేకరిస్తున్నట్లు వివరించారు.

బాల్య వివాహాలతో అనర్థాలే ఎక్కువ



మాట్లాడుతున్న లక్ష్మణ్‌నందన్

తెనాలి: రూరల్ మండల పరిధిలోని సంగంజాగర్లమూడిలో గల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో బుధవారం జిల్లా మహిళాభివృద్ధి, శిశు సంక్షేమశాఖ, జిల్లా బాలల పరిరక్షణ విభాగంలోని రైల్వే చైల్డ్ హెల్ప్ లైన్ సంయుక్త ఆధ్వర్యంలో 'బేటీ బచావో.. బేటీ పడావో'పై అవగాహన సదస్సును జరిపారు. పాఠశాల ప్రధానోపాధ్యాయుడు ఎ.శివరామకృష్ణ అధ్యక్షత వహించారు. రైల్వే చైల్డ్ హెల్ప్ లైన్ గుంటూరు టీమ్ సభ్యుడు వాకా లక్ష్మణ్‌నందన్ మాట్లాడారు. భారతదేశంలో లింగ వివక్షతను నిర్మూలించడానికి, ఆడపిల్లల రక్షణ కోసం ప్రధానమంత్రి నరేంద్ర మోదీ 'బేటీ బచావో బేటీ పడావో' కార్యక్రమాన్ని ప్రారంభించి పదేళ్లు అవుతోందని చెప్పారు. ఈ సందర్భంగా ఈ పథకంపై బాలికలకు అవగాహన సదస్సు ఏర్పాటుచేసినట్లు తెలిపారు. పథకం ఉద్దేశాన్ని, చేపడుతున్న కార్యక్రమాలను వివరించారు. బాలల రక్షణ కోసం హెల్ప్ లైన్ టోల్ ఫ్రీ నెంబర్ 1098 అందరికీ అందుబాటులో ఉంటుందని చెప్పారు. బాల్య వివాహాలు జరక్కుండా చూసుకోవాల్సిన బాధ్యత మనందరిపై ఉందన్నారు. అక్షరాస్యత శాతాన్ని పెంచి బాల కార్మికత్వాన్ని నిర్మూలించాలని తెలియజేశారు. అధ్యక్షత వహించిన ప్రధానోపాధ్యాయుడు శివరామకృష్ణ మాట్లాడుతూ ఈ ప్రాంతంలో తల్లిదండ్రులు కొందరు తమ ఆడపిల్లలను పదోతరగతి చదువుతో విద్యను పూర్తిగా ఆపివేస్తున్నారని తెలిపారు. ప్రతిభావంతులైన విద్యార్థినులను సైతం చదువు చెప్పించటం ఆపేసి, వివాహాలకు ప్రోత్సహించడం మంచి పద్ధతి కాదని సూచించారు. బాల్య వివాహాలతో కలిగే అనర్థాలను తెలియజేశారు. స్థానిక అంగన్‌వాడీ టీచర్లు ఎం.శివపార్వతి, వి.లక్ష్మి, నాగలక్ష్మి, అనురాధ, శివమ్మ, లక్ష్మీ తిరుపతమ్మ, పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

ఉచిత మల్టీ స్పెషాలిటీ వైద్య శిబిరానికి స్పందన



బాలికలకు వ్యాక్సిన్ వేస్తున్న వైద్య సిబ్బంది

తెనాలి: సూపర్‌స్టార్ జి.మహేశ్‌బాబు సతీమణి నమ్రత జన్మదినం సందర్భంగా దత్తత గ్రామమైన బుర్రిపాలెంలో బుధవారం విజయవాడలోని ఆంధ్ర హాస్పిటల్స్ సహకారంతో ఉచిత మల్టీ స్పెషాలిటీ వైద్య శిబిరం నిర్వహించారు. జనరల్ మెడిసిన్, పిల్లల వైద్యులు, ఈఎన్‌టీ, గుండెజబ్బులు, ఎముకల వైద్య నిపుణులు పాల్గొన్నారు. 162 మందికి వైద్య పరీక్షలు చేసి, అవసరమైన మందులు పంపిణీ చేశారు. పరిశుభ్రత, ఆహారం విషయంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలు, శ్వాసకోశ వ్యాధుల గురించి వివరించారు. ఇదే సందర్భంగా మహేశ్‌బాబు ఫౌండేషన్ సహాయంతో ఆంధ్ర హాస్పటల్స్ ఆధ్వర్యంలో 52 మంది పిల్లలకు హ్యూమన్ పాపిల్లోన్ వైరస్ వాక్సిన్ (గర్భాశయ ముఖద్వార క్యాన్సర్ నిరోధక వ్యాక్సిన్)ను చేశారు. హాస్పిటల్ డైరెక్టర్, పిల్లల వైద్యనిపుణుడు డాక్టర్ పీవీ రామారావు మాట్లాడుతూ గత తొమ్మిదేళ్లలో బుర్రిపాలెంలో 43 ఉచిత వైద్య శిబిరాలను నిర్వహించినట్లు తెలిపారు. వైద్యశిబిరంలో డాక్టర్ పవన్, డాక్టర్ సయ్యద్ ముదసిర్, డాక్టర్ కిశోర్, డాక్టర్ అమర్, డాక్టర్ రమేష్, నర్సులు, ఫార్మసిస్టులు, ల్యాబ్ టెక్నీషియన్లు పాల్గొన్నారు.

పొగమంచు ప్రమాదాలపై వాహనదారులకు అవగాహన



వాహనదారులకు అవగాహన కల్పిస్తున్న కేఎల్‌యూ విద్యార్థులు

తాడేపల్లిరూరల్: తెల్లవారుజామున దట్టంగా పొగమంచు కమ్ముకోవడంతో రోడ్లపై ఎదురుగా వచ్చే వాహనాలు కనిపించక ప్రమాదాలు జరిగే అవకాశాలు ఉంటాయని కేఎల్‌యూ కాలేజ్ ఆఫ్ సైన్స్ ప్రిన్సిపాల్ సుబ్రహ్మణ్యం వాహనదారులకు సూచించారు. బుధవారం తాడేపల్లి రూరల్‌పరిధిలోని వడ్డేశ్వరం కేఎల్ యూనివర్సిటీ ఎన్ఎస్ఎస్ విభాగం ఆధ్వర్యంలో దుగ్గిరాలలో జాతీయ రోడ్డు భద్రత మాసోత్సవాల్లో భాగంగా రోడ్డు భద్రతపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా వలంటీర్లు వాహనదారులకు రహదారి భద్రతపై అవగాహన కల్పించారు. యూనివర్సిటీ విద్యార్థి విభాగాధిపతి డాక్టర్ కేఆర్ఎస్ ప్రసాద్ మాట్లాడుతూ వాహనదారులు హెల్మెట్, సీటు బెల్టు ధరించి వాహనాలను నడపాలని, రోడ్డుభద్రతా సూచనలు పాటించి క్షేమంగా గమ్యస్థానాలకు చేరుకోవాలని వివరించారు. వలంటీర్లను, ఎన్ఎస్ఎస్ ఫీల్డ్ కో–ఆర్డినేటర్ పి.సురేష్‌లను వీసీ డాక్టర్ జి. పార్థసారథివర్మ, ప్రో వీసీలు డాక్టర్ ఏవీఎస్ ప్రసాద్, డాక్టర్ ఎన్.వెంకట్‌రామ్, డాక్టర్ కె.రాజశేఖరరావు, డాక్టర్ హబీబుల్లా ఖాన్, ప్రోగ్రాం కో–ఆర్డినేటర్ డాక్టర్ పి.శ్రీకాంత్ రెడ్డి, ప్రోగ్రాం ఆఫీసర్ డాక్టర్ ఉషారాణి తదితరులు అభినందించారు.

పారి స్కూల్ ఆఫ్ బిజినెస్‌కు సృజనాత్మక అవార్డు



అవార్డును అందుకుంటున్న పారి స్కూల్ ప్రోగ్రామ్ డైరెక్టర్ ధర్మతేజ

మంగళగిరి (తాడేపల్లిరూరల్): మంగళగిరి మండల పరిధిలోని నీరుకొండలో ఉన్న ఎస్ఆర్ఎం యూనివర్సిటీ ప్రాంగణంలో ఏర్పాటు చేసిన పారి స్కూల్ ఆఫ్ బిజినెస్‌కు సృజనాత్మక అవార్డు వచ్చినట్లు యూనివర్సిటీ బృందం బుధవారం తెలిపారు. ఈ సందర్భంగా యూనివర్సిటీ ప్రెసిడెంట్ డాక్టర్ సత్యనారాయణన్ మాట్లాడుతూ మూడేళ్ల కిందట ప్రారంభమైన పారి స్కూల్ ఆఫ్ బిజినెస్ ఎంబీఏ, బీబీఏ కోర్సుల నిర్వహణలో నూతన ఒరవడిని అవలంబిస్తోందని తెలిపారు. పాఠ్యప్రణాళిక, రూపకల్పన, విశేష అనుభవం ఉన్న అధ్యాపకుల ద్వారా బోధన కొనసాగిస్తోందని చెప్పారు. దీన్ని గుర్తించి ఔట్‌లుక్ మ్యాగజైన్ గతంలో దక్షిణ భారతదేశంలోనే ఎమర్జింగ్ బిజినెస్ స్కూల్‌గాను, బెస్ట్ ఎమర్జింగ్ స్కూల్‌గాను గుర్తించిందని పేర్కొన్నారు. ప్రపంచస్థాయి విద్యాబోధనతో పాటు ఉత్తమ ప్రమాణాలను కైవసం చేసుకోవడంలో ప్యారి స్కూల్ ఆఫ్ బిజినెస్ ప్రతిభను కనబర్చిందని, దీనిని గుర్తించిన అకడమిక్ ఇన్‌సైడ్స్ మ్యాగజైన్ 2024 సంవత్సరానికి గాను బెస్ట్ బిజినెస్ స్కూల్‌గా ఎంపిక చేసి అవార్డు ప్రకటించిందని వివరించారు. ఈనెల 18వ తేదీన బెంగళూరులో జరిగిన మ్యాజగైన్ ఎక్స్‌లెన్సు అవార్డుల కార్యక్రమంలో ఎస్ఆర్ఎం యూనివర్సిటీ కమ్యూనికేషన్స్ డైరెక్టర్ పంకజ్ బల్వేరియా, పారి స్కూల్ డైరెక్టర్ ధర్మతేజలు అవార్డును అందుకున్నట్లు తెలిపారు. ఈ సందర్భంగా పారి స్కూల్ డీన్ భరద్వాజను అభినందించారు.


ఎమ్మెల్సీ ఎన్నికల్లో లక్ష్మణరావును గెలిపించాలి

కొల్లిపర: రానున్న గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ ఎన్నికల్లో ప్రతి గ్రాడ్యుయేట్ ఒకే మాటపై ఉండి నిజాయతీగా ఉంటూ అనేక పోరాటాలు చేసిన కె.ఎస్.లక్ష్మణరావుని అఖండ విజయంతో గెలుపించుకోవాలని యూటీఎఫ్ రాష్ట్ర ఆడిట్ కమిటీ కన్వీనర్ టి.ఎస్.ఎన్. మల్లేశ్వరరావు కోరారు.కొల్లిపర మండల కేంద్రంలో బుధవారం లక్ష్మణరావు గెలుపు కోరుతూ ఆత్మీయ సమావేశం నిర్వహించారు.ఈ సందర్భంగా మల్లేశ్వరరావు మాట్లాడుతూ గతంలో ఎమ్మెల్సీగా లక్ష్మణరావు వివిధ వర్గాల ప్రజలు సమస్యలను మండలిలో సమర్థంగా ప్రస్తావించారని తెలిపారు. అన్ని రకాల పోరాటాలకు ముందుండి పూర్తి మద్దతు తెలియజేసినట్లు చెప్పారు. చేసిన మంచి పనులను ప్రతి ఒక్కరూ గుర్తు పెట్టుకుని ఆయన్ను గెలిపించాలని విజ్ఞప్తి చేశారు. సమావేశంలో విశ్రాంత ఎస్‌బీఐ ఏజీఎం కొల్లి శివనాగిరెడ్డి, రైతు నాయకులు ములక శివసాంబిరెడ్డి, కార్మిక నాయకులు ఎస్. భావన్నారాయణ, కోటా చంద్రశేఖర్, యూటీఎఫ్ నాయకులు కేదార్నాథ్, ప్రతాప్, అంగన్వాడీ, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

పశువుల పెంపకంలో జాగ్రత్తలు అవసరం

కొల్లిపర: పశువుల పెంపకంలో రైతులు జాగ్రత్తలు పాటించాలని మండల పశువైద్యాధికారి డాక్టర్ సాయిసతీష్‌రాజు పేర్కొన్నారు. మండలంలోని గుడిబందివారిపాలెంలో బుధవారం పశు వైద్య శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా డాక్టర్ మాట్లాడుతూ పశువుల్లో నట్ల నివారణకు పాడి రైతులు చర్యలు చేపట్టాలని తెలిపారు. అనంతరం పశువుల పెంపకంపై జాగ్రత్తలకు సంబంధించిన పోస్టర్లను ఆవిష్కరించారు.

ఎన్‌సీసీ క్యాడెట్‌కు అభినందన



శ్రీకాంత్‌ను సత్కరించిన ఈశ్వర్

తెనాలి:తెనాలిలోని 22వ ఆంధ్రప్రదేశ్ ఎన్‌సీసీ విభాగం నుంచి నేపాల్‌లో జరిగే వేడుకల్లో పాల్గొనేందుకు ఎంపికైన క్యాడెట్ నూకతోటి శ్రీకాంత్‌ను బుధవారం స్థానిక మార్తా నర్సింగ్ కాలేజీ చైర్మన్ యనమల ఈశ్వర్ అభినందించారు. బాపట్ల ఫార్మా కాలేజీలో బీఫార్మసీ చదువుతున్న శ్రీకాంత్ నేపాల్‌లో ఆర్మీడే ఆధ్వర్యంలో జరిగే మహాశివరాత్రి ఉత్సవాల్లో పాల్గొనేందుకు ఎంపికైనట్టు తెలిపారు. ఫిబ్రవరి 21 నుంచి మార్చి 4వ తేదీ వరకు ఈ వేడుకలు జరుగుతాయని చెప్పారు. శిబిరానికి దేశవ్యాప్తంగా 24 మంది ఎంపిక కాగా, ఆంధ్రా నుంచి శ్రీకాంత్ ఒక్కరే ఎంపికైనట్టు వివరించారు.

క్రీడల పైనా ఆసక్తి అవసరం



తెనాలి అర్బన్: విద్యార్థులు చదువుతో పాటు క్రీడల పైనా ఆసక్తి పెంచుకోవాలని వన్‌టౌన్ ఎస్ఐ సుబ్బయ్య సూచించారు. భాష్యం స్కూల్‌లో బుధవారం ఏర్పాటు చేసిన స్పోర్ట్స్ మీట్‌ను ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నేటి సమాజంలో విద్యార్థులు విద్యకు అధిక ప్రాధాన్యం ఇస్తూ క్రీడలను నిర్లక్ష్యం చేస్తున్నారని తెలిపారు. క్రీడలలో పాల్గొనటం వల్ల మానసిక ఒత్తిడి తగ్గుతుందని చెప్పారు. కార్యక్రమంలో స్కూల్ ప్రిన్సిపాల్ రాము, వైస్ ప్రిన్సిపాల్ మోహన్‌దాసు, హెచ్ఎం ఇంద్రజ, పలువురు ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

రైతుల శ్రేయస్సే లక్ష్యం



నూతనంగా ఎన్నికైన కార్యవర్గం

కొల్లిపర: రైతుల శ్రేయస్సే లక్ష్యంగా పాటు పడతామని నూతనంగా ఎన్నికై న నీటి సంఘాల అధ్యక్షులు పేర్కొన్నారు. ఇటీవల జరిగిన నీటి సంఘాల ఎన్నికల్లో గెలిచిన వేమూరి డీసీ ఉపాధ్యక్షులు తోట ఏడుకొండలు, కొల్లిపర నీటి సంఘం అధ్యక్షులు కోట వీరాంజయేలు ఆధ్వర్యంలో మండల పరిధిలోని పిడపర్రు లాకులు వద్ద బుధవారం ఆత్మీయ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఇరిగేషన్ శాఖ అధికారులు నూతనంగా ఎన్నికైన అధ్యక్షులకు, కార్యవర్గ సభ్యులకు మండలంలో చేపట్టాల్సి పనులు, విధి విధానాలను వివరించారు.అనంతరం కార్యవర్గ సభ్యులు మాట్లాడుతూ ఎన్‌జీఆర్ఎస్ ద్వారా పంట కాలువలు పూడికలు తీయడం వల్ల ఎటువంటి ప్రయోజనాలు లేవని తెలిపారు. పూడిక తీసిన నెలలోపలే అవి పూర్తిగా పూడిపోతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. చెక్ డ్యామ్‌లు అనేక చోట్ల పూర్తిగా దెబ్బతిన్నాయని, వాటిని మరలా నిర్మించాలని కోరారు. ఈ సమస్యలను ఉన్నత అధికారుల దృష్టికి తీసుకుపోతామని అధికారులు తెలిపారు.

తెలుగు కీర్తి ప్రతిభా పురస్కారాలు ప్రదానం



పురస్కారం అందుకున్న షేక్ అస్మతున్నీసా

తెనాలి: వరల్డ్ రైటర్స్ ఫోరం, వరల్డ్ పోయెట్రీ అకాడమీ, తెలుగు అసోసియేషన్ ఆఫ్ నేషనల్ అకాడమీ బుక్ ఆఫ్ రికార్డ్స్, అంతర్జాతీయ సంస్థ శ్రీశ్రీ కళావేదిక ఆధ్వర్యంలో మంగళవారం విజయవాడలో నిర్వహించిన తెలుగు కీర్తి జాతీయ ప్రతిభా పురస్కారాలను తెనాలికి చెందిన పలువురు కవులు స్వీకరించారు. తెనాలికి చెందిన అధ్యాపకురాలు, కవయిత్రి షేక్ అస్మతున్నీసా, కవి, పట్టణానికి చెందిన చందు చంద్రమౌళి మెమోరియల్ కళాసేవాసంఘం వ్యవస్థాపకుడు చందు సూర్య, కవి ఆళ్ల నాగేశ్వరావు ఈ పురస్కారాలను అందుకున్నవారిలో ఉన్నారు. శ్రీ శ్రీ కళావేదిక చైర్మన్ డాక్టర్ కత్తిమండ ప్రతాప్, జాతీయ కన్వీనర్ కొల్లి రమావతి వీరిని సత్కరించారు. సత్కార గ్రహీతలను పలువురు అభినందించారు.





పురస్కారం అందుకున్న చందు సూర్య, ఆళ్ల నాగేశ్వరరావు

హెచ్ఐవీ బాధితులకు సాయం అభినందనీయం



బాధితులకు బియ్యం, నిత్యవసర వస్తువులు పంపిణీ చేస్తున్న డాక్టర్ సౌభాగ్యవాణి.

తెనాలి అర్బన్: హెచ్ఐవీ బాధితులను ఆదుకునేందుకు స్వచ్ఛంద సంస్థలు ముందుకు రావడం అభినందనీయమని జిల్లా వైద్యశాల సూపరింటెండెంట్ డాక్టర్ సౌభాగ్యవాణి పేర్కొన్నారు. సర్వ్ ట్రస్ట్ ఆధ్వర్యంలో 50 మంది హెచ్ఐవీ బాధితులకు బియ్యం, కందిపప్పు, సబ్బులు, షాంపులను బుధవారం జిల్లావైద్యశాలలో పంపిణీ చేశారు. ఈసందర్భంగా ట్రస్ట్ డైరెక్టర్ లీలా లావణ్య మాట్లాడుతూ తమ సంస్థ ఆధ్వర్యంలో నర్సారావుపేట, చిలకలూరిపేట, అద్దంకి తదితర ప్రాంతాలలోని హెచ్ఐవీ బాధితులకు అనేక సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో ఏఆర్‌టీ సెంటర్ నోడల్ ఆఫీసర్ డాక్టర్ అంకినీయుడు, వైద్యులు డాక్టర్ రమ్యకృష్ణ, డాక్టర్ స్నేహ, సిబ్బంది పాల్గొన్నారు.

38 డిఫెన్స్ మద్యం బాటిళ్లు స్వాధీనం



రేపల్లె రూరల్: అక్రమంగా మద్యం నిల్వ ఉంచిన వ్యక్తిని అదుపులోకి తీసుకున్నట్లు ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ సీఐ దివాకర్ తెలిపారు. నిందితుని వివరాలను కార్యాలయంలో బుధవారం ఆయన వెల్లడించారు. పట్టణానికి చెందిన తులసీ హేమకుమార్ తన నివాసంలో 750 మిల్లీలీటర్ల 38 డిఫెన్స్ మద్యం బాటిళ్లను నిల్వ ఉంచాడన్నారు. తమకు అందిన సమాచారంతో అతని గృహంలో తనిఖీలు నిర్వహించి మద్యం బాటిళ్లను స్వాధీనం చేసుకోవటంతో పాటు అరెస్ట్ చేశామన్నారు. నివాస గృహాలలో అక్రమంగా మద్యం నిల్వలు ఉంచినా, విక్రయాలు జరిపినా చట్టరీత్యా నేరమన్నారు. కార్యక్రమంలో ఎక్సైజ్ అధికారులు నరహరిరావు, రామారావు తదితరులు పాల్గొన్నారు.